# బుద్ధి మాంధ్యులకు ఆసరా 'లేఖాదీప్'









లేఖాదీప్ సంస్థలో లెటర్‌ప్యాడ్లు, కవర్లు తయారీలో నిమగ్నమైన బుద్ధి మాంధ్యులు



వెంగళరావునగర్ :

పుట్టుకతోనే మానసిక వికలాంగులు. అస్పష్టంగా మాట్లాడగలరు, అయితే ఆలోచించే జ్ఞానం లేదు. తల్లిదండ్రులను గుర్తించగలరే గాని సోదరులతో ఆడుకోలేరు. నడవగలరే తప్ప మల మూత్ర విసర్జనకు వెళ్లాలన్నా కష్టమే. చివరకు కనీసం సొంతగా భోజనం కూడా తినలేరు. మిగిలిన పిల్లల్లా తల్లిదండ్రుల ప్రేమను పూర్తిస్థాయిలో పొందలేని పరిస్థితి. తోబుట్టువులు పాఠశాలలు, సినిమాలు, షికార్లు, పార్కులకు వెళ్లి వస్తుంటే చూస్తూ కూర్చోవడం తప్ప వారితో కలసి వెళ్లలేరు. కొందరు తల్లి దండ్రులు వారి అల్లరి చేస్తారేమోనని తమ వెంట తీసుకెళ్లడానికి కూడా ఇష్టపడరు.

**లేఖాదీప్‌లో...**

స్థానిక ఏజీ కాలనీలో ఉన్న 'లేఖాదీప్' సంస్థలో శిక్షణ పొందుతున్న బుద్ధి మాంద్యం కలిగిన విద్యార్థులు ఇందుకు సాక్ష్యంగా నిలిచారు. పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ అకౌంటెంట్స్ జనరల్ ఆఫీసెస్ ఎంప్లాయిస్ 'లేఖాదీప్' పేరుతో దీనిని 1994లో ఏర్పాటు చేశారు. వాస్తవంగా వారు విద్యార్థులు కాదు, వారు పెద్ద చదువులు కూడా చదువుకోలేదు. అయితే కష్టించి పని చేయగలరు. లేఖాదీప్‌లో పనిచేస్తున్న విద్యార్థులంతా బుద్ధిమాంద్యం ఉన్నా ప్రతి వస్తువును అకుంఠిత దీక్షతో చేస్తున్నారు.

**వృత్తి విద్యలో...**

ఇక్కడ శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు ఫైల్ బోర్డులు, ఎన్వలప్ కవర్లు, నోట్‌బుక్స్, ఫైల్ కవర్లు, ప్యాడ్స్, స్క్రిబ్లింగ్ ప్యాడ్లు, ఫినాయిల్, వాషింగ్ పౌడర్ తదితర వస్తువులు తయారు చేస్తుంటారు. రోజుకు వందకు పైగా పుస్తకాలు, ప్యాడ్లు ఇక్కడ తయారవుతుంటాయి. బ్రౌన్ పేపరును తీసుకుని దానిని వివిధ ఆకారాల్లో కత్తిరించి వారికి కావాల్సిన ఎన్వలప్స్ నాలుగైదు సైజుల్లో తయారు చేస్తుంటారు. అదే విధంగా ప్యాడ్లు కూడా కావాల్సిన మేర కత్తిరించి వాటికి డిజైన్ చేస్తారు. ఫినాయిల్, వాషింగ్ పౌడర్లు తయారీలో కొంత కష్టపడాల్సి వస్తున్నా సహచరుల తోడ్పాటుతో కావాల్సిన మేర అందజేస్తుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు శిక్షణా తరగతులు ఉంటాయి. ఇక్కడ లంగర్‌హౌస్, దిల్‌సుఖ్‌నగర్, సికింద్రాబాద్, బోరబండ, జగద్గిరిగుట్ట తదితర సుదూర ప్రాంతాల నుంచి కూడా విద్యార్థులు వచ్చి శిక్షణ తీసుకుంటారు. ఈ క్రమంలో తమ ప్రతిభా పాటవాలను చాటుకుంటూ వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకుంటున్నారు.

**మ్యూజిక్ కూడా...**

వస్తువుల తయారీతో పాటు మ్యూజిక్, కంప్యూటర్‌లో కూడా శిక్షణ తీసుకుంటున్నారు. వివిధ రకాల సంగీత వాయిద్యాలతో ట్రెనింగ్ ఇస్తుంటారు. ఇందుకోసం ప్రత్యేకించి తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. నిత్యం 45 మంది వరకు విద్యార్థులు తమ ఇళ్ల నుంచి వస్తుండగా, మరో 20 మంది వరకు అక్కడే హాస్టల్‌లో ఉంటున్నారు. ప్రతిరోజు యోగా కూడా చేయడం వీరి దినచర్యలో ఓ భాగం. ఇక్కడ తయారు చేసిన వస్తువులను నగరంలోని హుడా, హైకోర్టు, ఏజీ ఆఫీసు, ఆర్‌టీసీ తదితర కార్యాలయాలకు సరఫరా చేస్తుంటారు. అందులో వచ్చిన లాభాలను ఇక్కడ శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులకు స్టైఫండ్ రూపంలో అందజేస్తుంటారు.

**జాతీయస్థాయి అవార్డులు...**

ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు ఇప్పటికి ఆరుసార్లు జాతీయస్థాయి అవార్డులు అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది వికలాంగుల దినోత్సవం నాడు ఇచ్చే ఉత్తమ ఉద్యోగి అవార్డులు వీరు సొంతం చేసుకున్నారు. న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమాల్లో 1999 రాజ్‌కుమార్ అనే విద్యార్థి, 2006లో జెయం అరుణ్‌కుమార్‌లు అప్పటి రాష్ట్రపతుల చేతుల మీదుగా తీసుకున్నారు. 2008లో బెస్ట్ హ్యాండీక్యాప్డ్ సింగర్ అవార్డును జి సుజాత, బెస్ట్ హ్యాండీక్యాప్డ్ ఎంప్లాయి అవార్డును కె శ్రీకాంత్‌లు అందుకున్నారు. ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ ద్వారా అవార్డులను అందుకున్నారు. 2009లో ఎస్.రవికుమార్, 2011లో రఫీఖ్ పాషాలు జాతీయ అవార్డులు పొందారు. అదేవిధంగా 2002లో అరుణ్‌కుమార్ స్టేట్ అవార్డు, 2004, 2006లలో లేఖాదీప్ సంస్థకు ప్రేమలతా పేషవారియా, సేవారత్న అవార్డులు లభించాయి.

## ఇరవైఏళ్లుగా శిక్షణ

20 ఏళ్లుగా ఇక్కడ విద్యార్థులకు వివిధ వృత్తుల్లో శిక్షణ ఇస్తున్నాం. కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్, ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ సహకారంతో ఈ సంస్థ నడుస్తోంది. ప్రస్తుతం ఇక్కడ 70 మంది విద్యార్థుల వరకు శిక్షణ పొందుతున్నారు. ఈ సంస్థకు రెండుసార్లు జాతీయస్థాయి, ఒకసారి రాష్ట్రస్థాయి అవార్డు లభించింది.

– సాంబశివరావు, కార్యదర్శి